క్లుప్తంగా

పట్టు పరిశ్రమతో రైతులకు మేలు

మహబూబాబాద్ రూరల్: పట్టు పరిశ్రమతో రైతులకు మేలు జరుగుతుందని మహబూబాబాద్ పట్టుపరిశ్రమ అధికారి షోయబ్ ఖాన్ బుధవారం తెలిపారు. పట్టు వాణిజ్య పంట అని, పంట వ్యవధి 30రోజులు మాత్రమే ఉంటుందన్నారు. ఎకరం మల్బరీ తోటలో ఏడాదికి 5పంటలు సాధ్యమవుతాయని తెలిపారు. ఖర్చులు పోను రూ.3లక్షల ఆదాయం వస్తుందని, ముగ్గురికి ఉపాధి కూడా దొరుకుతుందన్నారు. జనగామ, సికింద్రాబాద్, షాద్‌నగర్, సూర్యాపేటలో మార్కెట్ సౌకర్యం ఉందన్నారు.

బొడ్రాయి వేడుకల్లో మంత్రి



దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో బుధవారం మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ తమ ఆచారాలకు అనుగుణంగా దైవ చింతనను కలిగి ఉండటం వలన మానసిక ప్రశాంతత చేకురుతుందని తెలిపారు. కార్యక్రమంలో దాట్ల సర్పంచ్ కొమ్మినేని రవీందర్, ఉపసర్పంచ్ బోర యాకన్న, సింగిల్‌విండో డైరెక్టర్ పేరాల కాంతరావు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని వినతి

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో దళితుల, గిరిజనుల భూములను కబ్జా చేస్తున్నారని వారిపై చర్య తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు కామ సంజీవరావు, వీరన్న మాట్లాడారు. దళితుల గిరిజనుల భూములకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జా చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

డిజిటల్ విద్యాబోధన

మహబూబాబాద్ అర్బన్: మన ఊరు– మన బడిలో మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలో ఇక నుంచి డిజిటల్ విద్యాబోధన అందిస్తామని డిజిటల్ బోర్డు ప్రోగ్రామ్ సమన్వయ కర్త సదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని డిజిటల్ బోర్డుల వినియోగంపై బుధవారం ఉపాధ్యాయులక శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షణ కోర్స్ డైరెక్టర్ మధు, శిక్షణ కోర్స్ డైరెక్టర్ మధు, మురళి, డీఆర్‌పీలు వీరన్న, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణం కోసం అష్టకష్టాలు

మహబూబాబాద్: ప్రభుత్వం ఇచ్చే లక్ష సాయం కోసం బీసీలు అష్టకష్టాలు పడుతున్నారని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీమ బీసీ సంక్షేమ సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులవృత్తి కులాలకు లక్ష రూపాయల ఆర్థికసాయానికి సర్టిఫికెట్లతో కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడువు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనంలో అపశృతి

కొత్తగూడ: రెజ్లర్లకు మద్దతుగా బీజేపీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా అపశృతి చోటు చేసుకుంది. మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న బ్రిజ్‌భూషన్ ను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దిష్టిబొమ్మపై పెట్రోల్ పోసి అంటించడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి మండలంలోని లడాయిగడ్డ గ్రామానికి చెందిన సత్యనారాయణకు అంటుకున్నాయి. దీంతో పక్కనే ఉన్న వారు మంటలను చల్లార్చి సత్యనారాయణను పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు

నగలు అప్పగించిన సిబ్బంది



కొత్తగూడ: బైక్ పై నుంచి పడి తీవ్ర గాయాలు అయిన బాధితులకు సంబంధించిన డబ్బు, నగలను 108 సిబ్బంది వారి బంధువులకు అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లపల్లి కళావతి, వీరన్న అనే దంపతులు భద్రాద్రి కొత్తగూడెం నుంచి వరంగల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తూ బుధవారం రాత్రి ఖానాపురం మండలం చిలుకమ్మనగర్ వద్ద ప్రమాదవశాత్తు పడి తీవ్ర గాయాలు అయి స్పృహ కోల్పోయి పడి ఉన్నారు. 108కి వచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన సిబ్బందికి రూ.51,330తోపాటు బంగారు ఆభరణాలు లభించాయి. వాటిని బాధితుల బంధువులకు సమాచారం అందించి, నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో అందజేశారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం, డబ్బులను తిరిగి ఇచ్చిన సిబ్బంది గోవర్దన్, మహేందర్‌లను అభినందించారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

గార్ల: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దకిష్టాపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన 16మంది బాలబాలికలకు ఎంఈఓ బి.పూల్‌చంద్ బుధవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్రావు, హెచ్‌ఎం శివ, ఎస్‌ఎంసీ చైర్మన్ మోతీలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిపెడ: మున్సిపాలిటీ కేంద్రంలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు ఉపేందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, అబ్బయ్య, నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, రామ్మోహన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జయసాగర్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు మల్లయ్య, నిరంజన్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు. అలాగే గుండ్రాతిమడుగు(విలేజీ)లో అక్షరాభ్యాసం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.లక్ష్మయ్య పాల్గొన్నారు.



గార్ల: మండలం పెద్దకిష్టాపురం పీఎస్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ పూల్‌చంద్

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అమనగల్ ఎంపీపీఎస్ ఆవరణలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కళ్లెం వెంకట్‌రెడ్డి, ఎంపీపీఎస్ హెచ్‌ఎం గుగులోత్ సత్యశంకర్, ఉపాధ్యాయులు సదానందం, రమేష్, శ్రీనివాస పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: ఈదులపూసపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఒకటోవ తరగతిలో చేరిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం సోమ గోవర్ధన్, ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాసం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, కృష్ణవేణి, సువర్ణ పాల్గొన్నారు.



మరిపెడ: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవంగర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని అవుతాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల నోడల్ హెచ్‌ఎం అల్లం దాసు భిక్షపతి, హెచ్‌ఎలు చిరంజీవి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా అందుతుందని ఎంఈఓ రాము అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోని పాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ రాము విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు.



మహబూబాబాద్ రూరల్: అమనగల్‌లో..



కురవిలో..

చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రెహమాన్, తేజోన్నత రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి మండలంలోని వివిధ గ్రామాలల్లో పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంపీటీసీ మధన్ డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి మండలంలోని వివిధ గ్రామాలల్లో వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయన్నారు. వంగిపోయిన స్తంభాలను సరిచేయాలని డిమాండ్ చేస్తు బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజ్ కుమార్ యాదవ్, నాయకులు నల్లాని పాపారావు, రమేష్, యాకిరెడ్డి, సంతోష్ సాయిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

గూడూరు: మారుమూల పాఠశాలలో చిన్నారుల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందించడం అభినందనీయమని సర్పంచ్ రాధ నర్సింహానాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాధావత్ చక్రు నాయక్ అన్నారు. మండలంలోని తాళ్లపాటితండా మండల పరిషత్ ప్రైమరీ బుధవారం హెచ్‌ఎం సోమ రవి మిత్రుడైన ధీరజ్ అందించిన నోటు పుస్తకాలు, మెటీరియల్స్‌లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయురాలు ఉమా, అంగన్‌వాడీ టీచర్ పార్వతి పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో వైద్యరంగానికి పెద్దపీట

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ: సీఎం కేసీఆర్ పాలనలోనే వైద్యరంగానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మరిపెడ ఆడిటోరియంలో బుధవారం వైద్యారోగ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో లేని విధంగా ప్రభుత్వాస్పత్రులకు రోగులు అధికంగా వస్తున్నారన్నారు. వైద్యరంగంలో తెలంగాణ ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారద, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళధర్‌రావు, తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం నీలికుర్తి, పర్కజలతండా గ్రామ పంచాయతీల పరిధిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేపట్టిన పర్యటన నాలుగోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను స్థానిక ప్రజలు కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్‌నాయక్, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, సర్పంచులు శ్రీనివాసరావు, బానోతు కమిలిలాలు, ఎంపీటీసీ భాస్కర్, ఉపసర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.



మరిపెడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

రోగులకు పండ్లు పంపిణీ

గూడూరు: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అవతరించాక మారుమూల పల్లెల్లో సహితం ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చిందని తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యారోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వీరన్ననాయక్, వైద్యులు పాల్గొన్నారు.

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజేష్, డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, డాక్టర్ అర్జున్, సర్పంచ్ అజ్మీర బస్సీలాల్, ఎంపీటీసీ శెట్టి రమేష్, ఖదీర్, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఆలయ నిర్మాణ కర్త నామిరెడ్డి సీతారాంరెడ్డి, హమేంద్రాదేవి దంపతుల ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయాన్ని లోకకల్యాణార్థం నిర్మించారు.

సన్మానం

పెద్దవంగర: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇటీవల తొర్రూరులో నిర్వహించిన మహిళా దినోత్సవంలో చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న కందునూరి గీత ఉత్తమ పీఈటీగా ఎంపికయ్యారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఉషాదయాకర్‌రావు, కలెక్టర్లు సన్మానించారు.

వాటర్ క్యాన్ల పంపిణీ

నెల్లికుదురు: మండంలలోని రామన్నగూడెం గ్రామ యూపీఎస్ పాఠశాలలకు వాటర్ క్యాన్లను లయన్స్ క్లబ్ నెల్లికుదురు వారి ఆధ్వర్యంలో బుధవారం అందించారు. క్లబ్ తొర్రూర్ రీజియన్ చైర్మన్ రేగూరి వెంకన్న పుట్టిన రోజును పురష్కరించుకుని కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి మద్ది లింగమూర్తి, ఉపాధ్యాయులు బాలు, బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

‘రైతులకు రూ.2లక్షల రుణమాఫీ’



మహబూబాబాద్ రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న తేజావత్ బెల్లయ్యనాయక్



గార్ల: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్, ప్రియాంకగాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ సందేశ్ ప్రచార కార్యక్రమం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామన్నపేట కాలనీలో కాంగ్రెస్‌పార్టీ అనుబంధ రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్సంటేజీల ప్రభుత్వం నడుస్తుందని ఈ ప్రాంతంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వ భూములను బినామీ పేర్లతో కాజేస్తున్నప్పటికీ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీతోపాటు వ్యవసాయ భూమి ఉన్న రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15వేలు, భూమిలేని ఉపాధి కూలీలకు రూ.12 వేల చొప్పున ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, గుగులోత్ వెంకటి, నరేష్, అచ్చాలి, రమణమ్మ, శైలజ, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలోని మంగళికాలనీకి చెందిన పలువురు బీజేపీ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

గార్లలో..

గార్ల: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఒకే దఫా రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు భూక్యా విజయలక్ష్మి అన్నారు. బుధవారం గార్లలో రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ కరపత్రాలను ఆమె కార్యకర్తలో కలిసి ఇంటింటికి పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కిషన్‌నాయక్, మండ రాముగౌడ్, శ్రీనివాస్, బాదావత్ ప్రసాద్, జగన్నాథం, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల



చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: ఇటీవల కురిసిన వడగళ్ల వాన పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును ములుగు ఎమ్మెల్యే సీతక్క మండల కేంద్రంలోని రైతు వేదికలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంగారం మండలం 418 రైతులకు రూ.44.84లక్షలు, కొత్తగూడలో 216 మంది రైతులకు గాను రూ.26.78లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. అనంతరం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కొత్తగూడ, గంగారం మండలలాల్లో రైతులు వర్షాధారంగా వ్యవసాయం చేసుకుంటారని ఫారెస్ట్ చట్టాల పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని ములుగు ఎమ్మెల్యే సీతక్క అటవీశాఖ అధికారులను కోరారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఫారెస్ట్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, సర్పంచ్ మల్లెల రణధీర్, జెడ్పీటీసీ పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, తహసీల్దార్ చందా నరేష్, ఏఓ ఉదయ్, రేంజ్ ఆఫీసర్ వజరహత్, ఎంపీడీఓ భారతి, డీటీ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను పట్టించుకోకుండా పండుగలా?

దంతాలపల్లి: రాష్ట్రంలో ప్రజలు పడుతున్న కష్టాలు, ఇబ్బందుల గురించి పట్టించుకోకుండా రాష్ట్రంలో పండుగలు నిర్వహిస్తారా అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రామచంద్రనాయక్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ఇటీవల గాలివాన బీభత్సవంతో ఇంటిపై కొట్టుకుపోయిన వారిని బుధవారం ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రెడ్యానాయక్ కాంగ్రెస్ పార్టీ వదిలి బీఆర్ఎస్ పార్టీకి వెళ్లాక నియోజకవర్గానికి చేసింది ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. పెద్దముప్పారం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం జరుగుతూనే ఉందని, అవి పూర్తి చేసేది ఎప్పుడు ప్రజలకు చెప్పాలన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. అనంతరం దాట్ల గ్రామంలో బొడ్రాయి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బట్టునాయక్, సాదు లింగారెడ్డి, రామ్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

గంగారం: మండలంలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన పిడబోయిన రమేష్ ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఈసం రమసురేష్, వైస్ ఎంపీపీ వీరభద్ర పోతయ్య, సర్పంచ్ గోగ్గల లక్ష్మయ్య, మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై మంత్రి ఆరా..

కేసముద్రం: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా, పలుచోట్ల కట్టిన బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించిన ఘటనపై మంత్రి సత్యవతిరాథోడ్ ఆరా తీశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు శ్రీనివాస్‌ను మంత్రి తొలగింపు విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

గూడూరు: మండలంలోని రాములుతండా శివారు సాంబయ్యపల్లిలో బుధవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు స్వగ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. సాంబయ్యపల్లికి చెందిన చల్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సంపత్, ఈశ్వర్‌లు గత 35 సంవత్సరాల క్రితం స్వాగ్రామం సాంబయ్యపల్లి నుంచి వెళ్లి వరంగల్‌లో వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. స్వగ్రామంపై గుర్తుతో సొంత ఖర్చులతో గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.

రక్తదానాన్ని ప్రోత్సహించాలి



పెద్దవంగర: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని, దానం చేసేందుకు ఇతరులను ప్రోత్సహించాలని ఎస్సై పిల్లల రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు తొర్రూరులో నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

బయ్యారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించటం ద్వారానే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యం అవుతుందని పార్టీ నియోజకవర్గ నాయకులు జి.రవి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి ప్రచారపత్రాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముసలయ్య, శ్రీనివాసరెడ్డి, కేతమల్లు, నిరంజన్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుమల్, క్రిష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

నర్సింహులపేట: జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని డోర్నకల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రామచంద్రు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు బొల్లం గౌరయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ

డోర్నకల్: మండలంలోని మన్నెగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌కు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పాటి రమేష్ ఆధ్వర్యంలో రెండు సీలింగ్ ఫ్యాన్లను పాఠశాల హెచ్‌ఎం హచ్చాకు బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు విత్తనాల సుధాకర్, యశోధర్ జైన్, మురళీధర్, ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీధర్, డీఎస్ వినోద్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు: మారుమూల గ్రామాల్లోని మేరు కులస్తులను గుర్తించి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని సంఘం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ సోమా కోటేశ్వర్ రావు, కోకన్వీనర్ అడపా మల్లికార్జున్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పొడిషెట్టి సురేష్‌మేరును, ప్రధాన కార్యదర్శిగా ధీకొండ కృష్ణ, కోశాధికారిగా సంగ రాజు, ఉపాధ్యక్షులుగా కొత్తకొండ గోవర్ధన్, రామగిరి శ్రీనివాస్, ధీకొండ నాగేశ్వర్‌రావు, ధీకొండ శ్రీనివాస్, గూడూరు వెంకన్న, కార్యదర్శులుగా శీలం రమేష్, సుధాకర్, సంపత్‌కుమార్, సతీష్, చాణక్య, సహాయ కార్యదర్శులుగా ఉపేందర్, వెంకన్న ఎన్నుకున్నారు.

స్టడీమెటీరియల్ పంపిణీ

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ రేవూరి వెంకన్న పుట్టినరోజు సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు.

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండా, బంచరాయి తండా, బంగారిగూడెం, చౌళ్లతండా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బానోత్ దేవేందర్ నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్..

ఆర్టీసీ బస్సులో ఆగిన ప్రయాణికుడి గుండె



కురవి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడి గుండె ఆగింది. కురవి మండలం మోద్గులగూడెం గ్రామానికి చెందిన కందిపాటి హుస్సేన్(57) అనే వ్యక్తి గ్రామంలో జరిగిన ఉపాధి పనికి వెళ్లాడు. పనికి వెళ్లి ఇంటికి వచ్చిన హుస్సేన్ నీరసంగా ఉండడంతో స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు పరీక్షించాడు. ఆరోగ్యం బాగాలేదని, ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పాడు. హుస్సేన్‌ను ఖమ్మంలోని ప్రైవేట్ వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం నుంచి మహబూబాబాద్‌కు ఆర్టీసీ(పల్లెవెలుగు) బస్సులో హుస్సేన్‌ను అతని అల్లుడు తీసుకొస్తున్నాడు. బస్సులో వస్తుండగా ఒక్కసారిగా హుస్సేన్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే ఆర్టీసీ బస్సు కండక్టర్‌కు చెప్పడంతో బస్సును నిలిపివేశారు. వెంటనే ఆర్టీసీ కండక్టర్ 108కి సమాచారం అందజేశారు. సిబ్బంది వచ్చి హుస్సేన్‌ను పరీక్షించి చనిపోయారని చెప్పారు. కండక్టర్, డ్రైవర్‌లు మానవతా దృక్పథంతో ఆలోచించి మృతదేహాన్ని బస్సులో తీసుకొచ్చి మోద్గులగూడెం స్టేజీ వద్ద దింపారు. బంధువులు మృతదేహాన్ని దింపి ఆటోలో ఇంటికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య ఉప్పలమ్మ, కుమారుడు కమలాకర్, ఇద్దరు కవిత, రజిత కుమార్తెలున్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కేసముద్రం: ఎలుకలమందు తాగిన ఓ వివాహిత మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని ధన్నసరి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ధన్నసరి గ్రామానికి చెందిన సుంచు రవి, మండల కేంద్రం శివారు లక్ష్మీనగర్‌కి చెందిన భారతి(33)తో 14ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా భారతి తన తల్లిగారింటికి వద్దే ఉంటుంది. ఈక్రమంలో పెద్దమనుషులతో మాట్లాడి కూతురిని భర్త వద్దకు పంపించాలని అనుకుంటుండగా, తనను అత్తగారింటికి పంపిస్తారనే భయాందోళనకు గురైన ఆమె క్షణికావేశంతో ఈనెల 8న ఇంట్లో ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందున్న జీపీ కార్మికుడు..

గార్ల: మద్యం సేవించడం మానేయాలని తల్లి మందలించడంతో ఓ పంచాయతీ కార్మికుడు పురుగుమందు తాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన మాగం మోహన్(33) పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తూ వచ్చిన జీతమంతా ఇంట్లో ఇవ్వకుండా, మద్యంకే ఖర్చు పెడుతున్నావు.. ఇంకా నీకు పెళ్లి కూడా కాలేదు మద్యం మానేయాలని తల్లి వెంకటమ్మ మందలించడంతో జీవితం పై విరక్తి చెందిన మోహన్ మంగళవారం విధుల్లో భాగంగా నర్సరీ మొక్కలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి పురుగుమందు తాగాడు. 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి అన్న సైదులు ఫిర్యాదు మేరకు ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మోహన్, ఉద్యోగం రెగ్యులర్ కాకపోవడంతోనే జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి మృతిచెందాడని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ్ల అప్పిరెడ్డి ఆరోపించారు.

పేలిన సెల్ ఫోన్.. తప్పిన ప్రమాదం

కొత్తగూడ: నూతనంగా కొనుగోలు చేసిన సెల్ ఫోన్ పేలిన ఘటన మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం వెలుగు చూసింది. బాధితుడు పత్తిపాక వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. వారంరోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ సెల్ షాప్‌లో రెడ్‌మీ కంపెనీ సెల్ పది వేల రూపాయలతో కొనుగోలు చేశాడు. చార్జింగ్ పెట్టి పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చి పేలింది. సమీపంలో ఎవరు లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.